క్లుప్తంగా

అయోధ్య అక్షింతల పంపిణీ



మర్రిమందలో అక్షింతల పంపిణీ

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో విశ్వ హిందూ పరిషత్ సభ్యుడు ఆదూరి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అయోధ్య శ్రీరామ మందిర నుంచి వచ్చిన అక్షింతలను పంపిణీ చేశారు. కందాడు, పాతవీరాపురం, మర్రిమంద, వ్యాసాశ్రమం, మడిబాక తదితర గ్రామాల ఆలయాల్లో పూజలు నిర్వహించి అక్షింతలతో పాటు శ్రీరాముని చిత్ర పటాన్ని గ్రామస్తులకు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు నాగరాజురెడ్డి, కిరణ్, సుబ్రమణ్యంరెడ్డి, గురవారెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీర్లచావిడివీధి శ్రీరామలవారి మందిరం నుంచి శనివారం అయోధ్య శ్రీరాముని పూజిత పవిత్ర అక్షింతల వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మాజీ చైర్మన్ కోలా ఆనంద్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

తాటిపర్తి మాజీ సర్పంచ్ మృతి



నివాళి అర్పిస్తున్న అనసూయమ్మ, నాయకులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం తాటిపర్తి మాజీ సర్పంచ్ నెలబల్లి రాజయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అత్త అనసూయమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు ఆ గ్రామానికి చేరుకుని రాజయ్య మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిర్వహణకు వాసుదేవ నాయుడు ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ అండగా ఉంటుందంటూ భరోసా ఇచ్చారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 70 మంది హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: జవహర్ నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 70 మంది విద్యార్థులు హాజరైనట్లు డిపార్ట్‌మెంటల్ అధికారి ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 4 గదుల్లో నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. చీఫ్‌గా కే.భారతి, ఎంఈవో కే.రవి పర్యవేక్షించారు. విద్యార్థుల పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్‌ఎంలు వైద్య శిబిరం, పోలీసులు గట్టి బందో బస్తు నిర్వహించారు.

ఆడుదాం-ఆంధ్రా విజేత పెరిందేశం జట్టు



కేవీబీపురం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పెరిందేశం జట్టు విజేతగా నిలిచింది. మండల స్థాయి క్రికెట్ పోటీల్లో 19 సచివాలయాల జట్లు పాల్గొనగా పెరిందేశం, సదాశివపురం జట్లు ఫైనల్స్‌కు చేరాయి. శనివారం రాయపేడు వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పెరిందేశం జట్టు 89 పరుగులు చేసింది. 90 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సదాశివపురం జట్టు పది ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసింది. పెరిందేశం జట్టు 30 పరుగుల తేడాతో విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు చేరింది. జట్టులో వంశీ, బత్తెయ్య, సంపత్, భాగ్యరాజ్, బొబ్బిలి బెస్ట్ ప్లేయర్స్‌గా ప్రకటించారు. మండల స్థాయి విన్నర్స్‌గా నిలిచిన పెరిందేశం జట్టును మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

వైభవంగా పుర ఉత్సవం



శ్రీకాళహస్తి: పట్టణంలోని పద్మశాలిపేటలో శనివారం శ్రీభద్రావతి సమేత భావనారుషి పుర ఉత్సవం వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనతరం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయంలో ఈనెల 17వ తేదీ నుంచి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం నాటితో ముగియనున్నాయి.

కండలేరులో 12.427 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 12.427 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పులివల్లంలో అభివృద్ధి పరుగులు



నాడు-నేడులో అభివృద్ధి చేసిన పులివల్లం ప్రాథమిక పాఠశాల



సిమెంట్ రోడ్డు



నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

- రూ.1.42 కోట్లతో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం: మండలంలోని పులివల్లం పంచాయతీ అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. కనీస వసతులకు నోచుకోని పరిస్థితి నుంచి నేడు అన్ని హంగులతో ముందుకు సాగుతోంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పులివల్లం గ్రామ పంచాయతీలో 300 గృహాలు ఉన్నాయి. 1000 మందికి పైగా జనాభా ఉంది. ఇక్కడ ఎక్కువ మంది వ్యవసాయంతోపాటు కూలి పనులు చేసుకునే వారే. గతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ట్యాంకు నిర్మించి తాగునీటిని సరఫరా చేయాలని పలుమార్లు అధికారులు, నాయకులను కోరినా ప్రయోజనం లేదు. వీధుల్లో రోడ్ల సౌకరం లేక ఇబ్బంది పడేవారు. ఏదైనా జబ్బు చేస్తే మండల కేంద్రమైన వరదయ్యపాళెంలోని పీహెచ్‌సీతో పాటు సూళ్లూరుపేట, తడ ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.1.42 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా గ్రామ అభివృద్ధితోపాటు ప్రజల అవసరాలకు ప్రభుత్వం పెద్దపీట వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- స్థానిక ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.17 లక్షల వ్యయంతో 20 వేల లీటర్ల హైలెవల్ వాటర్ ట్యాంకును నిర్మించారు. దానికి అనుసంధానంగా రూ.6 లక్షల వ్యయంతో 3 తాగునీటి బోర్లను ఏర్పాటు చేశారు.
- గ్రామంలో అన్ని వీధుల్లోనూ రూ.40 లక్షల వ్యయంతో 900 మీటర్ల మేరకు సిమెంటు రోడ్లను నిర్మించారు.
- స్థానికంగానే వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రూ.22 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్మిస్తున్నారు.
- కారిపాకం ప్రధాన రోడ్డు నుంచి బీఎస్‌పేటకు వెళ్లే పంచాయతీ రోడ్డును రూ.30 లక్షలతో సిమెంటు రోడ్డుగా మారుస్తున్నారు.
- పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సేకరించిన చెత్తను నిల్వ ఉంచేందుకు రూ.4.60 లక్షలతో డంపింగ్ యార్డ్ నిర్మించారు.
- రూ.3 లక్షలతో తాగునీటి అవసరాలకు 800 మీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేశారు.
- స్థానిక ప్రభుత్వ పాఠశాలను నాడు-నేడు కింద రూ.20 లక్షలతో నూతన హంగులతో అభివృద్ధి చేశారు.



వాటర్ ట్యాంకు

ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్లు



గతంలో ఎన్నడూ లేనివిధంగా పులివల్లంలోని వీధులు సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చెందాయి. స్థానిక సర్పంచ్ చొరవతో ప్రభుత్వ సహకారంతో గ్రామం అభివృద్ధి చెందుతోంది. చాలా సంతోషంగా ఉంది.

–నాగయ్య, పులివల్లం గిరిజనకాలనీ

తాగునీటి సమస్య తీరింది



గ్రామంలో నూతనంగా హైలెవల్ ట్యాంకు నిర్మించి 3 బోర్లు వేశారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గత ప్రభుత్వంలో ట్యాంక్ నిర్మాణం కోసం అనేకసార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేదు.

–చెల్లమ్మ, పులివల్లం

అందుబాటులోకి వైద్యసేవలు



మా ఊరిలోనే వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మిస్తున్నారు. దీంతో స్థానికంగానే వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. గతంలో ఏ చిన్న సమస్య వచ్చినా సూళ్లూరుపేట, తడ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది.

–లక్ష్మమ్మ, పులివల్లం

ఎమ్మెల్యే సహకారంతోనే..



ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సహకారంతోనే పులివల్లం పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టగలిగాం. సీసీ రోడ్ల నిర్మాణం, హైలెవల్ వాటర్ ట్యాంకు నిర్మించాం. తాగునీటి బోర్లు వేశాం. ఇంకా కొన్ని అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

–బాలకృష్ణ, సర్పంచ్, పులివల్లం పంచాయతీ

పక్కాగా కులగణన



కారణిలో కులగణన చేస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామాల్లో కులగణనను పక్కాగా చేస్తున్నట్టు తహసీల్దారు భార్గవి తెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో సచివాలయాల సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌వోలు కులగణనను చేస్తున్నారు. తహసీల్దారుభార్గవి శనివారం సర్వేను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సర్వేలో కుటుంబానికి సంబంధించి రేషన్ కార్డు వివరాలు, విద్య, మరుగుదొడ్డి, తాగునీరు, గేదెలు, కోళ్లు, వంట గ్యాస్, లేదా కట్టెల పొయ్యి తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. కుటుంబ సభ్యులు చెప్పిన కులాన్ని మాత్రమే నమోదు చేయాలని, కులానికి సంబంధించిన ఆధారాలు అడగరాదన్నారు. సర్వే పూర్తయిన తరువాత ఈకేవైసీ, బయోమెట్రిక్, తప్పనిసరిగా చేయాలన్నారు. పదిరోజుల లోపు సర్వేను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో త్రివిక్రమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎండీ పుత్తూరులో..



సర్వే చేస్తున్న సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో శనివారం సర్పంచ్ కందాటి మోహనప్రియ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది కులగణన సర్వే ప్రారంభించారు. కుటుంబంలోని వ్యక్తులు, కులం తదితర వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు ప్రజలు సర్వేకు సహకరించాలని సర్పంచ్ సూచించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యా బోధన అందించాలన్న సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేస్తోందని హెచ్‌ఎం రాజశేఖర్ తెలిపారు. అయన శనివారం నెలవాయి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చదవాలని సూచించారు. తెలుగు పండిట్ పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శ్రీశనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశ పూజ చేశారు. అనంతరం నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, పవిత్ర కలశ జలాలతో అభిషేకం చేశారు. తదుపరి విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

కార్మిక చట్టాల అమలు యాజమాన్యాలదే



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి బేబీరాణి

శ్రీకాళహస్తి: కర్మాగారాలు, సంస్థల్లో కార్మిక చట్టాలను అమలు చేయడం యాజమాన్యాల బాధ్యత అని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి అన్నారు. మండలంలోని కాపుగున్నేరి పంచాయతీ ఇసుకగుంట సమీపంలోని కోకాకోలా బేవరేజస్ లిమిటెడ్‌లో శనివారం పర్యావరణ పరిరక్షణ చట్టం, కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చట్టం ఏ ఒక్కరికి అనుకూలంగానో, వ్యతిరేకంగాను పనిచేయదన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని తెలిపారు. కార్మికుల హక్కులను హరించేలా యాజమాన్యాలు వ్యవహరిస్తే తగిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, శ్రీరామ్, సుబాని పాల్గొన్నారు.

ఉపాధిలో కూలీల శాతాన్ని పెంచాలి



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

ఏర్పేడు: ఉపాధి హామీ పనుల్లో కూలీల శాతాన్ని పెంచాలని ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ అధికారి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలకు విరివిగా ఉపాధి కల్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల పొలాల్లో ఫారంపాండ్(నీటి గుంతలు)పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని పేర్కొన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. జేఈ బాలాజీరావు, సాంకేతిక సహాయకులు మనోహర్, రవీంద్రుడు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అశ్రద్ధ వద్దు



పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న వైద్య బృందం

నారాయణవనం: వాతారణంలో మార్పుల వల్ల ప్రబలే జ్వరాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా యూనిట్ అధికారి మోహన్ బాబు, మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ తెలిపారు. వారు శనివారం అరణ్యంకండిగ సచివాలయం పరిధిలోని గోవిందప్పనాయుడుకండ్రిగ దళితవాడ వాసులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమకాటుతో డెంగీ, మలేరియా, చికున్‌గునియా, ఫైలేరియా, మెదడు వాపు తదితర జ్వరాలు ప్రబలుతాయని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. పాత టైర్లు వాడని రోళ్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం దోమల నివారణకు మందులు పిచికారీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్రయ్య, ఉప సర్పంచ్ మురళి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ జగనన్న ఆరోగ్య సురక్ష



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందతుందని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. మండలంలోని ఆలత్తూరు గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష –2 వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచితంగా 7 రకాల పరీక్షలు చేసి మందులు, కంటి అద్దాలు అందజేస్తున్నట్టు చెప్పారు. అనంతరం వృద్ధులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో జోరుగా వరి కోతలు



పెద్ద పాండూరు ప్రాంతంలో వరి కోత

వరదయ్యపాళెం: మండలంలోని వివిధ ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలోని చిలమత్తూరు, సీఎల్‌ఎన్‌పల్లి, రాచర్ల, కోవూరుపాడు, అంబూరు, వరదయ్యపాళెం, తొండంబట్టు, చిన్న పాండూరు, పెద్ద పాండూరు ప్రాంతాల్లో ఖరీఫ్ చివర, రబీ ప్రారంభంలో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో కోతలు జోరుగా సాగుతున్నాయి. మండలంలో ప్రస్తుత రబీ సీజన్‌లో 3500 హెక్టార్లలో వరి పంటను సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

పోలీస్ అధికారులకు డీఐజీ ప్రశంసలు





ప్రశంసా పత్రాలు అందుకుంటున్న తొట్టంబేడు ఎస్‌ఐ రాఘవేంద్ర, శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్

శ్రీకాళహస్తి: విధి నిర్వహణలో సాహసంతో, చాకచక్యంగా వ్యవహరించిన పలువురు పోలీసు అధికారులకు రాయలసీమ డీఐజీ అమ్మిరెడ్డి శనివారం ప్రశంసాపత్రాలను అందజేశారు. తిరుపతి పద్మావతి అతిథి గృహంలో జరిగిన క్రైం బ్యూరో సమావేశంలో శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ కుమార్ డీఐజీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల అమ్మపాళెం సమీపంలోని పంటకాలువలో దామినేడుకు చెందిన విద్యాలత మృతదేహం పడి ఉండడం సంచలనం సృష్టించింది. కేసును త్వరితగతిన ఛేదించడంతో సీఐకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

తొట్టంబేడులో..

గత నవంబర్ 29న సంభవించిన మిచౌంగ్ తుఫాన్‌లో కారాకొల్లు వాగులో చిక్కుకుపోయిన తొట్టంబేడు మండలం కారాకొల్లు గ్రామానికి చెందిన బత్తెయ్య నాయుడు, నాగరత్నమ్మ దంపతులను కాపాడిన తొట్టంబేడు ఎస్‌ఐ రాఘవేంద్రకు డీఐజీ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1.5 లక్షల విరాళం

రాపూరు : మండలంలోని పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం బెంగళూరుకు చెందిన నరసాపురం తిరుపాలయ్య, చెంగమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు హరిప్రసాద్, సింధు రూ.1,50,111 విరాళం ఇచ్చినట్టు ఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. వారికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు శశిస్వామి పాల్గొన్నారు.

ఆక్రమణలు అరికట్టాలని ఫిర్యాదు

సత్యవేడు: మండల పరిధిలోని పేరడం గ్రామంలో 80 సెంట్ల భూమిని ఆక్రమించుకునేందుకు స్థానికేతరులు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. వారు శనివారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. అంతుకుముందు వారు రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

ఘనంగా సర్వమంగళాదేవి జాతర



ట్రాక్టర్‌పై ఊరేగుతున్న సర్వమంగళాదేవి అమ్మవారు

సత్యవేడు: గిరిజన కాలనీ గ్రామ దేవత సర్వమంగళాదేవి సంక్రాంతి జాతర మహోత్సవం శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యంతోపాటు గాజులు, చీరలు సమర్పించారు.

మట్టి విగ్రహానికే అలంకరణ, మొక్కులు

ఉత్సవాల్లో పంచ లోహాలతో తయారు చేసిన ఉత్సవ విగ్రహాలకు అలంకరణ చేసి ఊరేగిస్తారు. సత్యవేడులో 65 ఏళ్లుగా సర్వమంగళాదేవి రూపాన్ని బంక మట్టితో గిరిజన కుటుంబీకులు ప్రత్యేకంగా తయారు చేస్తారు. పూలు, వస్త్రాలతో అమ్మవారిని అలంకరిస్తారు. ఉదయం అమ్మవారికి ఉయల సేవ, సాయంత్రం ఆలయం ఆవరణలో పొంగళ్లు పెడతారు. తర్వాత అమ్మవారిని గ్రామంలో ఊరేగించి అనంతరం చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగ తర్వాత అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ప్రతిమను తయారుచేసి పూలు, వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టారు. అనంతరం అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇళ్ల ముందు పెద్ద ఎత్తున ముగ్గులు వేశారు. విశేషపూలాంకరణతో అలకంరించిన అమ్మవారిని గొబ్బెమ్మ పాటలు పాడుతూ ఆలయం వద్దకు తీసుకు వచ్చారు. సర్వమంగళాదేవికి గిరిజనులు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి నృత్యాలు చేశారు. ట్రాక్టరుపై అమ్మవారిని ఊరేగించారు. శుక్రవారం రాత్రి ప్రారంభమైన ఊరేగింపు శనివారం ఉదయం 8 గంటల వరకు సాగింది. మహిళలు అమ్మవారి ఊరేగింపు వెంట గొబ్బెమ్మ పాటలు పాడుతూ సద్ది అన్నం, పెరుగు అన్నం తీసుకొని వెళ్లారు. సత్యవేడు బీసీ కాలనీ, గిరిజన కాలనీ, ఆర్టీసీ రోడ్డు, శ్రీకాళహస్తి బస్టాండు రోడ్డు, నేతాజీ రోడ్డు నుంచి జంట కోనేరు సమీపంలోని చెరువు వరకు ఊరేగింపు సాగింది. మహిళలు తెచ్చిన సద్ది అన్నం, పెరుగు అన్నం అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారిని జలధిలో నిమజ్జనం చేశారు. గత 65 సంవత్సరాలుగా అమ్మవారి జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు టి.మోహన్, సతీష్, సంజీవయ్య, తేజోకుమార్ తెలిపారు.



వీధిలో ముగ్గులు వేస్తున్న మహిళలు